క్లుప్తంగా

10న మండల సమావేశం

కొయ్యూరు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 10న నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో ప్రసాద్ గురువారం తెలిపారు. దీనిపై సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులకు సమాచారం ఇచ్చామన్నారు. అన్ని శాఖల అధికారులు విధిగా సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు.

స్తంభించిన సెల్ సేవలు.. వినియోగదారులకు అవస్థలు


అలంకారప్రాయంగా బీఎస్ఎన్ఎల్ టవర్

గంగవరం : కొత్తాడలో ఏర్పాటు చేసిన బీఎస్ఎన్ఎల్ సెల్‌టవర్ సక్రమంగా పనిచేయక సెల్ వినియోగదారులు నానా పాట్లు పడుతున్నారు. గత నెల రోజులుగా సెల్ టవర్ సక్రమంగా పనిచేయడం లేదని కొత్తాడ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో సెల్‌టవర్ ఉన్నా నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో తరచూ సెల్‌ఫోన్లు మోగబోతున్నాయని చెబుతున్నారు. ఆన్‌లైన్ సేవలకు తీవ్ర జాప్యం జరుగుతుందని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సెల్‌సిగ్నల్స్ అందక అత్యవసర సేవలు పొందడానికి, సమాచారం ఇవ్వడానికి అవకాశం ఉండడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బీఎస్ఎన్ఎల్ అధికారులు చర్యలు తీసుకొని టవర్ పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరారు.

రోడ్డు పనులు ప్రారంభం


రోడ్డు పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ సుబ్బలక్ష్మి, ఎంపీటీసీ సన్యాసిదొర

జి.మాడుగుల: మండలంలో పెద్దలువ్వాసింగి పంచాయతీ తియ్యగుండం నుంచి బొడ్డుకురాలు గ్రామం వరకు రోడ్డు నిర్మాణ పనులను గురువారం సర్పంచ్ కొండపల్లి సుబ్బలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు గబ్బాడి సన్యాసిదొర ప్రారంభించారు. ఆయా గ్రామాల మధ్య పంచాయతీ నిధులతో 58 కిలోమీటర్లు మట్టి రోడ్డు నిర్మాణంతో అనేక గిరిజన గ్రామాల్లో రోడ్డు రవాణా సౌకర్యం ఏర్పడుతుందని ఆయన వారు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కొండపల్లి సత్యనారాయణ, బంగ్రరాజు, నీలకంఠం, రాంబాబు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, వీఆర్వీ కోటిబాబు, ఏసుబాబు, వార్డు నంబర్లు వనగల వరహాలమ్మచ మాజీ సర్పంచ్ పండుదొర గ్రామస్తులు పాల్గొన్నారు.

భారీ అన్నసమారాధన


అన్నదానంలో పాల్గొన్న భక్తులు

రాజవొమ్మంగి: స్థానిక షిర్డీ సాయిబాబా ఆలయంలో గురువారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని జరిగింది. హైదరాబాద్‌కు చెందిన భక్తులు రవి ప్రసాద్, సీతాదేవి కార్యక్రమానికి విరాళం అందజేసినట్టు కమిటీ సభ్యులు తెలిపారు. సాయంత్రం భజనలు, హారతి కార్యక్రమం నిర్వహించారు. స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు.

ఆటో అపహరణ


కొక్కిరాపల్లిలో అపహరణకు గురైన ఆటో(ఫైల్)

జి.మాడుగుల: మండలంలో పాలమామిడి పంచాయతీ కొక్కిరాపల్లి గ్రామానికి చెందిన గిరిజనుడికి చెందిన ఆటో బుధవారం చోరీకి గురైంది. కొక్కిరాపల్లి గ్రామానికి చెందిన ఊలంగి ఇస్సాకు చెందిన ఆటోను ఇంటి బయట పార్క్ చేయగా గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించుకుపోయారని తెలిపారు. ఈ విషయమై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు బాధితుడు ఇస్సా చెప్పారు.

సమస్యలతో సహవాసం

- మరమ్మతుకు నోచుకోని రహదారులు
- వాహనచోదకుల అవస్థలు
- గ్రామాల్లో పడకేసిన పారిశుధ్యం
- డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్త
- దోమల స్వైరవిహారం
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం


డుంబ్రిగుడ ప్రధాన రహదారి వద్ద ఉన్న డ్రైనేజీలో తొలగించని చెత్త

అరకులోయటౌన్: ఆంధ్రా ఊటీగా పేరొందిన పర్యాటక ప్రాంతమైన అరకులోయలో రహదారులు అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. మండల వ్యాప్తంగా పలు ప్రధాన రహదారులు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. అడుగుకో గుంత, గజానికో గొయ్యి మాదిరి ప్రస్తుత రొడ్ల పరిస్థితి ఉంది. దీంతో ఆయా రహదారుల్లో ప్రయాణానికి నరకయాతన పడుతున్నారు. రోడ్లు బాగాలేని కారణంగా గ్రామాలకు 104, 108 అంబులెన్స్ వాహనాలు వెళ్లేందుకు అష్టకష్టాలు పడాల్సిన దుస్థితి. దీంతో సకాలంలో వైద్య సేవలందక గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు కావస్తున్నా గిరిజన ప్రాంత రహదారులకు మరమ్మతు చేసిన దాఖలాలు కనపడడం లేదు. అధికారంలోకి వస్తే రోడ్లు బాగు చేస్తామని కూటమి నేతల మాటలు నీటి మూటలేనని పలువురు విమర్శిస్తున్నారు. మండలంలోని 14 గ్రామ పంచాయతీల పరిధిలో ఏ గ్రామాన్ని చూసినా అధ్వాన రహదారులే దర్శనమిస్తున్నాయి. ఇందులో భాగంగా విశాఖ–అరకు ప్రధాన రహదారిలోని పానిరంగిని రైల్వే బ్రిడ్జి వద్ద, వేలి రిసార్ట్స్ వద్ద, బొసుబెడ గ్రామం వద్ద రహదారులు గోతులతో దర్శనమిస్తున్నాయి. మాడగడ– హట్టగుడ రహదారి మధ్యలో కల్వర్టు లేకపోవడంతో వర్షం పడితే బురదలో వాహనాలు కూరుకుపోతున్నాయి. గన్నెల జంక్షన్ నుంచి గన్నెల, గన్నెల గ్రామం నుంచి లోతేరు వరకు రహదారులు శిథిలావస్థకు చేరాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, యంత్రాంగం స్పందించి రహదారులు బాగు చేయాలని స్థానికులతో పాటు పర్యాటకులు కోరుతున్నారు.


పానిరంగిని రైల్వే బ్రిడ్జి వద్ద శిథిలమైన రహదారి

వీధులన్నీ దుర్గంధమయం

డుంబ్రిగుడ: మండల కేంద్రంలోని ఉన్న డ్రైనేజీల్లో చెత్త తొలగించకపోవడంతో దుర్వాసనతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. డ్రైనేజీల్లో పూడిక పనులు చేపట్టకపోవడంతో చెత్త పేరుకుపోయింది. వర్షాలు పడడంతో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో మురుగునీరు ఎటు వెళ్లలేని పరిస్థితుల్లో రహదారులపై పారుతోంది.పలు చోట్ల డ్రైనేజీల్లో మట్టి పేరుకుపోయి పిచ్చి మొక్కలు వెలిశాయి. డ్రైనేజీల్లో వ్యర్థాలు తొలగించకపోవడంతో దుర్గంధంతో పాటు దోమలు వ్యాప్తి చెందుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోగాలు ప్రబలే అవకాశముంది ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.


బోసుబెడ ప్రధాన రహదారిలో గోతుల్లో చేరిన వర్షపునీరు

దుర్వాసనతో అవస్థలు

రోజుల తరబడి డ్రైనేజీల్లో చెత్త తొలగించకపోవడంతో మురుగునీరు రోడ్లపై పారుతోంది. దుర్గందంతో సతమతమవుతున్నాం. ముక్కుమూసుకొని వెళ్లాల్సి వస్తోంది. దోమలు పెరగడంతో ఇక్కట్లు పడుతున్నాం. రోగాలు ప్రబలుతాయని భయపడుతున్నాం. వీధుల్లో చెత్త కుప్పలను తొలగించకపోవడంతో మరింత ఇబ్బందులు పడుతున్నాం.– రాంబాబు, డుంబ్రిగుడ

అధ్వాన రహదారులు

అరకులోయలో అన్ని చోట్ల రహదారులు అధ్వానంగా ఉన్నాయి. ఎక్కడ చూసినా గోతులతో నిండి ఉన్న రహదారులు దర్శనమిస్తున్నాయి. రాళ్లు తేలిన రహదారులపై ప్రయాణానికి నానా అవస్థలు పడుతున్నాం. దరచూ ప్రమాదాలు జరిగి వాహనచోదకులు గాయాలపాలవుతున్నారు.

– రవి, అరకులోయ

సత్వరమే పనులు పూర్తి చేయాలి


అసంపూర్తిగా ఉన్న గ్రామ సచివాలయ భవన నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో రామకష్ణ

గంగవరం: మండలంలో అసంపూర్తిగా ఉన్న గ్రామ సచివాలయ భవన నిర్మాణాలను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ఎంపీడీవో పీజీ రామకృష్ణ చెప్పారు. మండల కేంద్రంలోని గంగవరం, లక్కొండ గ్రామాల్లో ఆయన గురువారం పర్యటించారు. అసంపూర్తి నిర్మాణాలుగా ఉన్న గ్రామ సచివాలయ భవనాలను ఆయన పరిశీలించారు. ఇప్పటివరకు పనిచేసిన దానికి పనిదినాలు రికార్డు పూర్తిచేయాలని మండల ఇంజనీరింగ్ అధికారి రవితేజను ఎంపీడీవో సూచించారు. సచివాలయ భవన నిర్మాణ పనులు సత్వరమే చేపట్టాలని కాంట్రాక్టర్లను ఎంపీడీవో ఆదేశించారు. సాధ్యమైనంత త్వరలో గ్రామ సచివాలయ భవన నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట ఉపాధి హామీ ఏపీవో ప్రకాష్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

రోడ్డు మరమ్మతులకు నిధుల మంజూరు

కొయ్యూరు: కాకరపాడు నుంచి కొయ్యూరు వరకు రోడ్డు మరమ్మతులకు రూ.12 లక్షలు మంజూరయ్యాయి. కాంట్రాక్టర్ పనులను వేగవంతంగా చేపట్టారు. గతం నుంచి ఈ రోడ్డును ఏడు మీటర్ల వెడల్పు చేయాలన్న ప్రతిపాదన ఉన్నా దానిని మంజూరు చేయలేదు. గోతులు పూడ్చేందుకు నిధులు మంజూరు చేశారు. కాకరపాడు, సింగవరం ఐటీడీఏ కాలనీల్లో కాలువలపై వెంటనే వంతెనలు మంజూరు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

భవన నిర్మాణాల్లో నాణ్యత పాటించాలి

ఐటీడీఏ పీవో అభిషేక్

ముంచంగిపుట్టు: అదనపు తరగతి భవన నిర్మాణాల్లో నాణ్యత పాటిస్తూ పనులు చేయాలని పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ అన్నారు. మండలంలో గల కిలగాడ పంచాయతీ కేంద్రంలో ఆయన గురువారం పర్యటించారు. గ్రామంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో రూ1.30కోట్లతో జరగుతున్న పాఠశాల అదనపు తరగతి భవన నిర్మాణపు పనులను పరిశీలించారు. శరవేగంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు ఆదేశించారు.ఈ సందర్భంగా పీవో అభిషేక్ మాట్లాడుతూ అదనపు భవనాల పనులు వేగవంతం చేయాలని, నిర్మాణ పనులలో ఎటువంటి నిర్లక్ష్యంగా ఉన్న సహించేది లేదన్నారు. నిర్దిష్టమైన గడువులోగా భవనాన్ని పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. అనంతరం పాఠశాలలను సందర్శించి పలు రికార్డులు తనిఖీ చేశారు. 9వ తరగతి విద్యార్థులకు సాంఘిక శాస్త్రం పాఠ్యాంశాలను బోధించారు. కేరీర్ గైడెన్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. గిరిజన సంక్షేమశాఖ ఈఈ కె.వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.


కిలగాడలో భవన నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్

బీమాను సద్వినియోగం చేసుకోవాలి

చింతపల్లి: రాజ్‌మా, చిక్కుళ్లు సాగుచేస్తున్న గిరిజన రైతులు ప్రభుత్వం కల్పిస్తున్న బీమా సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ అనూషదేవి, జెడ్పీటీసీ బాలయ్యపడాల్ అన్నారు. వారు గురువారం విలేకరులతో మాట్లాడారు.గిరిజన రైతాంగం ప్రకృతి వైపరీత్యాల ద్వారా వేసిన పంటలను నష్ట పోయో పరిస్థితులను ఎదుర్కొంటున్నారన్నారు. ఈ పరిస్థితులను అదిగమించేందుకు నష్ట నివారణకు ప్రభుత్వం కల్పిస్తున్న బీమా సౌకర్యంలో ప్రతి రైతు నమోదు చేసుకోవాలన్నారు. డిసెంబర్ 15 వరకు బీమా సదుపాయానికి గడువు పెంచడంతో రైతులు తమ ఆధార్‌కార్డు, పట్టాదారు పాసు పుస్తకం, బ్యాంక్ అకౌంట్ నంబరుతో సమీపంలోగల మీ సేవా కేంద్రాల్లో రూ. 300 చెల్లించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.


మాట్లాడుతున్న జెడ్పీటీసీ బాలయ్య పడాల్, ఎంపీపీ అనూషదేవి

సీపీఎం జిల్లా కమిటీ ఎన్నిక

పాడేరు: సీపీఎం అల్లూరి జిల్లా ప్రథమ మహాసభల్లో భాగంగా గురువారం నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. ఈ నూతన కమిటీని మహాసభ ఆమోదించింది. ఇందులో భాగంగా అల్లూరి జిల్లా కార్యదర్శిగా పి.అప్పలనర్స, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులుగా కిల్లో సురేంద్ర , వి.ఉమామహేశ్వరరావు, డి.గంగరాజు, బి.సీహెచ్.పడాల్, కె.త్రినాథ్, ఎస్.బి.పోతురాజు నియమితులయ్యారు. జిల్లా కమిటీ సభ్యులుగా బి.సన్నిబాబు, వి.వి.జయ, ఎస్.హైమావతి, ఎల్. సుందర్ రావు, కె రామారావు, కె బుజ్జిబాబు, ఎస్.సూరిబాబు, వి.మహేశ్, పాలకి లక్కు, కె.మొస్య, దాసు, కుమారి నియమితులయ్యారు.

పీటీఎం సమావేశానికి తల్లిదండ్రులకు ఆహ్వానం


ఆముదాలబంద ఎంపీపీ పాఠశాలలో నిర్వహించిన పీఎంసీ సమావేశం

గంగవరం : మండలంలోని అన్ని పాఠశాలల్లో ఈ నెల 7న నిర్వహించనున్న తల్లిదండ్రులు, ఉపాధ్యాయ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరుతూ ఆయా పాఠశాలల్లో పీఎంసీ సమావేశాలను నిర్వహిస్తున్నారు.

పలు పాఠశాలల్లో గురువారం పీఎంసీ సమావేశాలను ప్రధానోపాధ్యాయులు నిర్వహించారు. మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ మీటింగ్‌లో చర్చించాల్సిన అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే ఉపాధ్యాయులు, విద్యార్థులు గ్రామాల్లో ఇంటింటా పర్యటించి ఆహ్వానపత్రికలను అందజేస్తున్నారు. పలు గ్రామాల్లో విద్యార్థులు కాగితాలతో తయారుచేసిన ఆహ్వాన పత్రికలు ఎంతో ఆకట్టుకున్నాయి.



గంగవరం ఆశ్రమ బాలికొన్నత పాఠశాల విద్యార్థులు తయారు చేసిన ఆహ్వానపత్రిక

అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీప్రైమరీ బోధన

చింతపల్లి : అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్యాబోధన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఐసీడీఎస్ పీవో జి.వి.రమణి అన్నారు. రాజుపాకలు, కృష్ణాపురం, చింతలూరు అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల తల్లులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ప్రాథమిక విద్య ద్వారా ఐదేళ్ల తర్వాత విద్యార్థులు వివిధ అంశాలలో చురుగ్గా ఉంటారన్నారు. చదవడం రాయడం ద్వారా చిన్నారులకు విద్యాభ్యాసం సులభతరమవుతుందన్నారు. సూపర్‌వైజర్లు ఉన్నీషాబేగం, సత్యవతి, విజయకుమారి, గౌరీ, అప్పలనర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీవో రమణి

మన్యంలో ముమ్మరంగా వరి కోతలు


రాజవొమ్మంగిలో ధాన్యాన్ని ఎండలో ఆరబెడుతున్న రైతులు


డుంబ్రిగుడలో వరి కుప్పలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న మహిళలు

- ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు రైతుల వినతి
- పనుల్లో నిమగ్నమైన గిరిజన రైతులు

రాజవొమ్మంగి: మండలంలో ఎటుచూసిన పక్వానికి వచ్చిన వరి పంట కనులకు ఇంపుగా కనుపిస్తోంది. మండలంలో సుమారు 6వేల ఎకరాల్లో వరి సాగయ్యింది. కాగా కోతలు మొదలయ్యే సమయానికి తుపాను హెచ్చరికలతో రైతులు ఆందోళన చెంది కోతలు వాయిదా వేసుకొన్నారు. ప్రస్తుతం తుపాను బెడద లేకపోవడంతో తిరిగి కోతలు ముమ్మరం చేశారు. ఇప్పటివరకు సుమారు 35 శాతం మాత్రమే కోతలు పూర్తయినట్టు అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా మండలంలో ఆరు చోట్ల ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్టు అధికారికంగా ప్రకటించారు. అయితే ఇంత వరకు జడ్డంగిలో మాత్రమే కొనుగోలు కేంద్రం తెరిచారు. ఈ ఏడాది మండలంలో సుమారు 7వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని అధికారులు లక్ష్యంగా నిర్ణయించుకున్నట్టు తెలిసింది. ప్రస్తుతం జోరుగా కోతలు జరుగుతున్న నేపథ్యంలో మండలంలో మిగతా చోట్ల కూడా ధాన్యం కొనుగోలు కేంద్రాలు తెరిచి కొనుగోలు ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు. మరో తుపాను రాక ముందే కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

యంత్రాల కొరత

ప్రస్తుతం పరిస్థితుల్లో వరి కోత పనులు వేగం పుంజుకోగా వరి కోత యంత్రాల కొరత నెలకొంది. నిత్యం ఆకాశం మేఘావృతం అయి ఉండడం, తుపాను వాతావరణం కారణంగా రైతులు కూలీలచే పనులు చేయించేందుకు సుముఖంగా లేరు. యంత్రాలపైనే ఆధారపడుతున్నారు. ఈ నేపథ్యంలో రైతులు యంత్రాల కోసం ఎదురు చూస్తున్నారు. ఇదిలా ఉండగా యంత్రం అద్దెకు గంటకు రూ. 3,500 చెల్లించాల్సి ఉంటుంది. ఎకరం నేలలో కోత కోసేందుకు రెండు గంటల సమయం పడుతోందని రైతులు చెబుతున్నారు. కాగా యంత్రంతో కోత పూర్తి చేస్తే సాయంకాలానికే గింజలు ఇంటికి వస్తుండటంతో రైతులు యంత్రాలపైనే ఆధారపడుతున్నారు.

సాక్షి,పాడేరు: ఏజెన్సీ వ్యాప్తంగా కోత కోసిన వరి పంటను గిరిజన రైతులు సురక్షిత ప్రాంతాలకు తరలించే పనులను ఉత్సాహంగా చేపడుతున్నారు. హుకుంపేట మండలం సూకూరు రోడ్డులోని చట్రాయిపుట్టు గిరిజనులు వరిపనల కట్టలను కావిడతో బైక్‌పై తరలించే పనులు చేపట్టారు.

చిరుజల్లులు.. ఆందోళనలో రైతులు

డుంబ్రిగుడ: మండలంలోని గురువారం చిరుజల్లులు పడుతుండటంతో గిరిజన రైతులు భయాందోళన చెందారు. వరి కుప్పలను సురక్షిత ప్రాంతాలకు తరలించే పనుల్లో నిమగ్నమై ఉన్నారు. గడిచిన ఐదు రోజులుగా తుపాను ప్రభావంతో ఇబ్బందులు పడ్డ రైతులు వర్షాలు ఆగిపోవడంతో వరి నూర్పిలు చేసుకొవ్వని ఆశపడ్డారు అయితే చెదురుమొదుగుగా వర్షాలు పడుతుండటంతో గిరిజనుల ఆశలు ఆడిఆశలవుతున్నాయి. నిరాశతో పొలాల్లో పన్నలు కట్టి కల్లంలోకి ధాన్యం పన్నలకు మోసుకు వెళ్తున్నారు.


రాజవొమ్మంగిలో యంత్రంతో వరి కోతలు


పాడేరులో బైక్‌పై వరిపనల కట్టలు తీసుకెళ్తున్న రైతులు


డుంబ్రిగుడలో వరి పనలను కడుతున్న గిరిజనులు

నిరుద్యోగుల వివరాలు సేకరించాలి

- ఎంపీడీవో ఉమామహేశ్వరరావు



గూడెంకొత్తవీధి: చదువుకుని గ్రామాల్లో ఖాళీగా ఉంటున్న గిరిజన నిరుద్యోగ యువతీ యువకుల వివరాలను సేకరించాలని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు అన్నారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులతో ఆయన గురువారం సమీక్ష నిర్వహించారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమానికి సంబంధించి యువతకు ఉపాధి కల్పించే విషయంలో యువత వివరాలు సేకరించాలన్నారు. స్వర్ణ పంచాయతీలకు సంబంధించి సమగ్ర సర్వే చేపట్టాలన్నారు. సచివాలయ ఉద్యోగులు సమయ పాలన పాటించాలన్నారు. ఈవోపీఆర్డీ పాపారావు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థులపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యవైఖరి

అరకులోయటౌన్: నియోజకవర్గ కేంద్రమైన అరకులోయలోని గురుకులం బాలుర పాఠశాలలో గురువారం కాంగ్రెస్ పార్టీ నాయకులు సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా నాయకుడు పాచిపెంట చిన స్వామి మాట్లాడారు. గత 20 రోజులుగా పాఠశాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉపాధ్యాయులు దీక్ష చేపడుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు.

వెంటనే వారి సమస్యలు పరిష్కరించాలన్నారు. రాష్ట్రంలోని 199 గురుకుల పాఠశాలల్లో సుమారు 80వేల మంది విద్యార్థులు చదువుతున్నారన్నారన్నారు. 1650 మంది కాంట్రాక్టు ఉపాధ్యాయులు చేపట్టిన సమ్మె కారణంగా విద్యార్థులకు చదువుకు దూరం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన విద్యార్థులపై ప్రభుత్వం చిన్న చూపు చూస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించి కాంట్రాక్టు ఉపాధ్యాయుల సమస్య పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. నాయకులు శెట్టి భగత్‌రామ్, గంగాధర్, జ్ఞాన సుందరి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బాలుర పాఠశాల ఎదుట నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

హైందవ ధర్మ పరిరక్షణకు కృషి


కుంచపల్లిలో భక్తులతో సమరసత ఫౌండేషన్ ప్రతినిధులు తదితరులు

పాడేరు రూరల్(అరుకు రూరల్): మండలంలోని కుంచపల్లి గ్రామంలో సమరసత సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కురస ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ హైందవ ధర్మ పరిరక్షణకు అందరూ కృషి చేయాలన్నారు. విశ్వహిందు పరిషత్ ఆధ్వర్యంలో జనవరి 5న విజయవాడలో హైందవ శంఖారావ భారీ బహిరంగ సభను నిర్వహించనున్నట్టు చెప్పారు. అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. మత్స్యకొండబాబు, సుబ్బారావు, గణేష్, బొంజుబాబు, అప్పలకొండరమణమూర్తి, చిన్నబాలన్న పాల్గొన్నారు.